14.

# విశ్వము విష్ణుస్వరూపము

విశ్వమందు విభుడు వెల్గుచునుండును
విభునియందు వెలుగు విశ్వమెపుడు
విభుడు వెలగకున్న విశ్వంబు వెలుగదు
విశ్వవిభుల మైత్రి శాశ్వతంబు.

ప్రేమస్వరూపులారా!

విశ్వము కారణము. విశ్వము కార్యము. విభుడు కారకుడు. సృష్టి సృష్టికర్తలకు ఉన్నట్టి సంబంధ బాంధవ్యములు ఎవరుకూడను వివరించలేరు. కార్య కారణ సంబంధమే యీ జగత్తు. ఇట్టి విశ్వమునందు ఎందు చూచిననూ దివ్యత్వమే కాని మరొక పదార్థము లేదు. చరాచర ప్రపంచమంతయూ దైవముయొక్క స్వరూపమే కాని అన్యము కాదు. విశ్వము విష్ణుస్వరూపము. కాని వివిధ రూపనామములతో గోచరించుచున్నప్పటికినీ, ఇది కేవలము విష్ణు స్వరూపమే. ఇట్టి విశ్వస్వరూపమయినట్టి దివ్యత్వాన్ని మనము గుర్తించుకొనలేక కేవలము ప్రాకృతమైన, లౌకికమైన, భౌతికమైన విశ్వముగా తలంచి అనేక విధములైనట్టి ఒక నిరాశకు, నిస్పృహకు గురి అవుతున్నాము. ప్రతి మానవుడు నిరంతర కృషిచే, నిర్విరామ కృషిచే, నిరంతర తాపత్రయములచే, అంతులేని ఆశలచే, అర్థంకాని ఆవేదనలచే అప్రాప్తమైన ప్రాప్తికై ప్రాకులాడి కట్టకడపటికిక నిస్పృహను పొందుతున్నాడు. కారణము తాను నెగెటివ్ స్థాయిలో ఉంటున్నాడు. విశ్వమంతయు పాజిటివ్ స్థాయిలో ఉంటున్నాది. నెగెటివ్, పాజిటివ్ రెండింటియొక్క ఏకత్వం చేతనే దివ్యత్వం ప్రాప్తిస్తుంది.

**కర్మఫలములే సుఖదుఃఖాలు**

చెడ్డ పని చేసి మంచిని చెందబోరు
మంచి పని చేసి కీడును గాంచబోరు

sri sathyasai vachanamrutam

నింబమును నాట చూత ఫలంబు గనున?
చూతమును నాటి నింబంబు పొందనగునె?

కనుకనే, మనము ఏ విత్తులు నాటెదమో ఆ మొక్కనే వస్తుంది, ఏ మొక్కగా ఉంటాదో ఆ వృక్షమే, ఆ వృక్షమునకు తగినట్టి ఫలమే ప్రాప్తిస్తుంది. మానవుడు అనేక విధములైన సంకల్పములు అభివృద్ధి పరచుకొని, తన సంకల్పమునకు తగినట్టి ఫలము లభించలేదని అనేక విధములుగా తాను నిరాశకు గురి అవుతూ ఉంటాడు.

ఇది చేతు నది చేతు నింకెన్నియో చేతు
నను చు నూహలు అల్లి అలసిపోకు
ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటిరో
ఆ ఫలములే మీకు అందుచుండు
విత్తనం బొకటైన వేరైన ఫలములు
సమకూరు టదియెట్లు సాధ్యమగును?
తెలివితేటలు మరి బల మెంత యుండిన
కర్మ దాటగజాలు ఘనుడు లేడు
ఎన్ని చేసిన నవియన్ని యెంచియెంచి
మంచినైనను చెడునైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల
కర్మ లన్నియు చేర్చిన కంఠమాల.

తల్లిగర్భమునుండి జన్మించినపుడు
కంఠమాలలనేవి కానరావు
మంచి ముత్యపు సరుల్ మచ్చునకును లేవు
మేల్మి బంగరుదండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చల మాలలు పొదగలేదు, కానీ

sri sathyasaivachanamrutam

**కలదు కలదొక్క మాల మీ కంఠమందు**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల.**

ప్రతి మానవుని కంఠమందు తనకు తెలియనటువంటి ఒక మాల ధరించి యున్నాడు. కనుకనే ప్రతి మానవుడుకూడను పవిత్రమైన కర్మలు ఆచరించాలి. అప్పుడే పవిత్రమైన ఫలితము కూడను అందుకోడానికి మానవుడు అర్హుడవుతాడు. కాని దివ్యత్వం గుర్తించుకొనలేక, మానవత్వాన్ని అర్థం చేసుకొనలేక కేవలము పశుత్వం చేత అశాంతికి గురి అవుతున్నాడు. ఇది మానవునకు సరియైనట్టి ధర్మముకాదు. మానవత్వం పవిత్రమైనటువంటిది. ఈ దివ్యమైనట్టి మానవత్వాన్ని ధరించి కూడా, ఈ మానవత్వాన్ని గుర్తించుకొనలేక పోవడం యిది మరింత శోచనీయము.

**మానవత్వాన్నే గుర్తించ లేనివారు దైవత్వాన్నెలా గుర్తించగలరు?**

ఎందరో యోగులు కలరు. ఎందరో ధ్యానులు కలరు. ఎందరో త్యాగులు కలరు. కాని మానవునియందున్న యిటువంటి మానవత్వాన్నే గుర్తించు కోలేనివారు, ఇక మానవులలో ఉన్నట్టి దైవత్వాన్ని ఏ విధముగా గుర్తించగలరు? కనుక మొట్టమొదట మానవత్వాన్ని గుర్తించాలి. తదుపరి దివ్యత్వమనేటి దైవత్వం మన కర్థమవుతుంది. ABCD లే నేర్చుకోలేనట్టి వాడు words building ఏ రీతిగా ఆడగలడు? ఈ word building ఆడలేనట్టి వాడు sentence ని ఏ రీతిగా చదువగలడు? కనుక words అనేటివి. The one you think you are ఇవి The one others think you are. ఈ sentence, the one you really are. ఈ భౌతికమైన దేహము, మానసికమైన దేహము ఆత్మపైనే ఆధారపడి యుంటాయి. కనుక మనస్సు అనేటిది కేవలము ఒక పిచ్చి కోతి వంటిది. Mind is like a mad monkey. Body is like a water bubble. Don't follow the mind and don't follow the body. Follow the Conscience. ఈ మార్గములో మానవుడు ప్రయత్నం చేసినప్పుడు దివ్యత్వమనే దానిని కొంతవరకైనా అర్థము చేసుకోగలడు.

**జ్ఞానులు కూడ ఒకప్పుడు పొరబడుతుంటారు**

ఎన్నో విధములైనట్టి దైవత్వాన్ని తెలుసుకున్నట్టి మానవులుకూడను, గొప్ప

పండితులు కూడను, కవులుకూడను, మేధావులుకూడను మధ్య మధ్య కొంత తప్పు మార్గములు పడుతుంటారు. దైవాన్ని సరిగ్గా అర్థము చేసికొనలేక పోతుంటారు. ఈ కఠినమైనట్టి భావములకు, కష్టములకు గురికావడము చేత దైవత్వాన్ని దూషిస్తుంటారు. ఇది కేవలము ఒక individual కి సంబంధించినట్టిదే కాని యిది fundamental కి సంబంధించినట్టిది కాదు. ఈ స్వార్థ ప్రయోజనములకు పాటుపడి తను అనేక విధములైనట్టి నిరాశలకు గురి అయిపోయి దైవాన్ని కూడను విమర్శిస్తుంటారు. మీకు అందరికీ తెలుసు. త్యాగరాజు గొప్ప కవి, భక్తుడు, గొప్ప గాయకుడు. కాని తనకు లభించినటువంటి కష్టములకు భరించుకొనలేక 'రామా! ఎన్ని విధములుగా నిన్ను భజించాను? స్మరించాను? గానంతో నిన్ను వర్ణించాను. కాని నా బాధలు నీవర్థం చేసుకొనలేక పోతున్నావు. నాలో భక్తి లేదా? నీలో శక్తి లేదా? నాలోన భక్తి ఉన్నది. సర్వకాల సర్వావస్థలయందుకూడను నీ నామమునే స్మరిస్తూ, నీ నామమునే జపిస్తూ, నీ నామమునే గానం చేసుకుంటున్నాను. నీ లోనే శక్తి లేదనుకుంటున్నాను. తక్షణమే మళ్ళీ కళ్ళు మూసుకొని చింతించాడు. ఈ అజ్ఞానమనేది అతనిలో ఆవిర్భవించింది. అప్పుడు తిరిగి రాముణ్ణి క్షమాపణ కొరుకుంటున్నాడు.

**కపి వారధి దాటునా? కలికిరోట గట్టునా?**
**లక్ష్మిదేవి వలచునా? లక్ష్మణుండు కొలుచునా?**
**సూక్ష్మబుద్ధి గల భరతుడు చూచి చూచి మ్రొక్కునా?**
**అబ్బ రామ శక్తి ఎంతో గొప్పరా**

ఓ రామా! నీ శక్తిని నేను గుర్తించుకోలేక పోయాను. నేను మానవుడను. అజ్ఞానిని అని తనను తాను నిందించుకున్నాడు. ఈ విధంగా యిలాంటి ఎందరో గొప్ప గొప్ప భక్తులైనట్టి వారు కూడను కొన్ని బాధలను భరించుకొనలేక భగవంతుని విమర్శిస్తూ ఉంటారు. కాని యీ కష్టములు ఒక సుఖముకే లభించినవనే సత్యాన్ని గుర్తించుకోలేక పోతున్నారు. కష్టములు లేక సుఖములకు విలువనే లేదు. 'నసుఖాత్ లభ్యతే సుఖం' సుఖము నుంచి సుఖము మనకు ప్రాప్తించదు చీకటి లేక వెలుతురునకు ప్రకాశం లేదు. ఈ లైటుకు

sri sathyasai vachanamrutam

ప్రకాశము నందించేటువంటిది చీకటే. మానవులయందు ఉన్నటువంటి విలువలో, దివ్యత్వమైనట్టి భావములో ప్రకాశింప చేసేటంటిది కష్టములే. ఈ రెండింటియొక్క ఏకత్వమే మానవత్వం. The pleasure is an interval between two pains. కనుకనే ఒకానొక సమయములోపల కష్టములు మనకు వచ్చినప్పటికిని, ఇది ఏదో ఒక సుఖాన్ని లభింప చేసేటందుకు వచ్చిందని స్మరించుకోవాలి.

**మాణిక్య వాచికర్‌లో మార్పు తెచ్చిన సత్సంగం**

తమిళదేశములోపల పాండ్యదేశమనేటిది మహా ప్రఖ్యాతి గాంచినట్టి దేశము. కాని యీ పాండ్యరాజు తనయొక్క ఆశ్వాలను అభివృద్ధి పరుచుకోవాలని ఆశించాడు. అప్పుడు తన మంత్రి అయినట్టి వానిని పంపించి, ఆ మంత్రితో కొంతమంది సిపాయిలను చేర్చి, రొక్కము నిచ్చి, సరియైనట్టి అశ్వములు తీసుకుని రమ్మని పంపించాడు. ఈ గుర్రములు తెచ్చే నిమిత్తమై మంత్రి సిపాయిలతో వెళ్తున్నాడు. పెరుందరై అనే గ్రామము వద్ద నిలచాడు. అప్పుడక్కడ ఒక భక్తుడు, కేవలము సాధకుడు యోగీశ్వరుడనేటివాడున్నాడు. అతని బోధనలంతా వింటూ వచ్చాడు మంత్రి. ఈ మంత్రి చాలా యువకుడు. ఆయన ఒక యవకుడై ఉండినను యిలాంటి పవిత్రమైన భక్తి భావములు అభివృద్ధి అవుతూ వచ్చాయి. ఈ భక్తి ప్రపత్తులను అభివృద్ధి పరచుకోవాలని అక్కడే అన్నీ మరచిపోయి కూర్చున్నాడు. సిపాయిలు కూడను అక్కడనే ఉండిపోయారు. తీసుకుపోయిన రొక్కమంతయుకూడను ఖర్చువున్నాది. కొంచెము దూరములో ఒక శివాలయం కూడ ఉంది. ఈ శివాలయము చాలా పాడయిపోయింది. దానిని గమనించి, దానిని సవరించి, ఆలయముయొక్క నిర్మాణము గావిస్తూ వచ్చాడు. ఈ విధమైనట్టి వార్త పాండ్యరాజునకు చేరింది. గుర్రములు తీసుకురావడానికి వచ్చిన మంత్రి యీ విధమైనట్టి ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించి, గురువులను సేవించుకుంటూ, మందిరాలు కట్టించుకుంటూ, తీసుకుపోయిన రొక్కము నంతయును వ్యర్థము చేస్తున్నాడనిపించిది రాజుకు. ఆ పాండ్యరాజు పిలిపించాడు యీ మంత్రి వెళ్ళాడు. ఆనందముగా వెళ్ళాడు. ఏ విచారములేదు. ఎందుకు విచారము? తప్పు చేసినవానికి విచారము ఉంటాది కాని, భగవంతుని స్మరిస్తూ కాలము పవిత్రంగా

sri sathyasaivachanamrutam

గడిపేవానికి బాధలెందుకుంటాయి? మంత్రీ! నిన్ను గుర్రములు తెమ్మని పంపిస్తే యీ రొక్కమంతయు యీ విధముగా దుర్వినియోగం చేస్తూ వచ్చావు. ఈ దుర్వినియోగమునకు నేనేమాత్రము దుఃఖించడములేదు. కోపద్దము లేదు. కాని నా ఆజ్ఞను నీవు పాలించలేకపోతున్నావు. కనుక యిలాంటి మంత్రి ఉండి ప్రయోజనము లేదు. అని అతనిని ఒక చెరసాలలో పెట్టించాడు. అక్కడ కూడను భగవంతుని నామాన్ని స్మరించుకుంటూ, కాలము గడుపుతూ వచ్చాడీ యువకుడైన మంత్రి. ఆ చెరసాలయందే కొన్ని భగవంతుని గురించి కొన్ని వాఖ్యలు వ్రాస్తూ వచ్చాడు. అతనియొక్క ప్రవర్తన చాలా ఉత్తమమైనదిగా గోచరించింది. అతనియొక్క నడవడికలు చాల పవిత్రమైనట్టివిగా గోచరించాయి. దీనిని గుర్తించినట్టి రాజు అతనిని చెరసాలనుండి విడిపించాడు. ఇంక నీ యిష్టమొచ్చినట్లు నీ సాధన చేసుకోమన్నాడు. అప్పుడా మంత్రి ఎంతనో ఆనందించి దయామయా! కృపానిధీ! నాపై యీనాటికి దయ కలిగిందా? ఇంతకాలము ప్రభుత్వ కార్యమునందు నా కాలము వ్యర్థము చేసుకున్నాను. నిన్ను స్మరించడానికి కాలమే లేకపోయింది. ఈనాడు నాకు తగినట్టి కాలము నీవు ప్రసాదించావు. కనుక నేను నీ చింతనలోనే నా జీవితము అంతము కావించుకుంటానన్నాడు. అక్కడ తను యీ భగవంతుని వ్యాఖ్యలు వ్రాసుకుంటూ దీనినే ఒక విధమైనట్టి వేదప్రమాణంగా తీసుకుంటూ వచ్చాడు. దానినే 'తిరుప్పువై' అని పేరు పెట్టారు. తాను నిరంతరము కూడను, సర్వకాల సర్వావస్థలలోను, భగవంతుని నామాన్నే స్మరిస్తూ వచ్చాడు. అతనే మాణిక్ వాచకర్. పేరుకు తగినట్లు అతను మాణిక్యముగా ప్రకాశిస్తూ వచ్చాడు.

**సత్యాన్నాస్తి పరోధర్మః**

కనుక ఒక్కొక్కరికి, ఒక్కొక్క విధమైనట్టి కష్టములు ప్రాప్తిస్తూ ఉంటాయి. కనుక యీ కష్టములు మన మంచికోసమే కాని చెడ్డకోసం కాదు. దివ్యత్వాన్ని అనుభవించలేనట్టివారు యీ ప్రాకృతమైనట్టి కష్టములను భరించి తీరాలి. ఈ కష్టములన్నీ నీవు భరించకుండిన దివ్యత్వము ప్రాప్తించదు. నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు. సత్యమును పలుకు, సత్యంవద, ధర్మంచర. ఈ రెండింటిని నీవు పాటిస్తూ రా. ఈ రెండింటికినీ అపజయమనేటిది ఎప్పటికీ లేదు. విజయమనేది యీ రెండింటినీ వరిస్తుంది. కనుక సత్యంన్నాస్తి పరోధర్మః. కనుక

srisathyasaivahini.org

ఎలాంటి పరిస్థితియందు కూడను నీవు సత్యాన్ని మాత్రము మరువవద్దు. జీవమున్నంత వరకును సత్యమునే నీ ప్రాణముగా తీసుకో. సత్యమే భగవత్స్వరూపము. సత్యములేని స్థానమే లేదు. సత్యము సర్వత్రా ఉంటున్నది. దీనికొక దేశము, కాలము, ప్రమాణము అంటూ లేవు. సత్యము అందరికీ ఒక్కటే. అమెరికన్ సత్యము, జపాన్ సత్యము, ఇటలీ సత్యము అని దీనికి భేదమే లేదు. అన్ని దేశముల వారికి సత్యము ఒక్కటే. కనుకనే Truth is GOD. ఈ సత్యమును అనుసరించు. ఈ సత్యమును అనుసరిస్తూ పోయినపుడు ధర్మమనేటువంటిది దానిననుసరిస్తూ వస్తుంది.

**సత్యధర్మాలను రక్షించుకొంటే దేశం రక్షింపబడుతుంది**

ప్రేమస్వరూపులారా! ఈనాడు మనము రక్షించవలసినది దేశాన్ని కాదు. దేశాన్ని ఎవరు కూడను రక్షించలేరు. సత్యాన్ని, ధర్మాన్ని రక్షిస్తే, ఆ సత్యధర్మములే దేశమును రక్షిస్తాయి. కనుక మనము యీనాడు చేయవలసినదేమిటంటే సత్యమార్గముననుసరించి, ధర్మమును తు.చ. తప్పకుండా పాటించినప్పుడు భగవత్ప్రేమ అనేటటువంటిది ఉట్టి పడుతుంది. భగవత్ప్రేమ ఉండినప్పుడే దివ్యత్వమైన భావములు మనలో ఆవిర్భవిస్తాయి. కనుక మనము పవిత్రమైన మార్గాలలో ఈ భావములను ప్రవేశపెట్టాలి. ధర్మమునకు రెండవరూపము ప్రేమ, పవిత్రము అని దీనికర్థము. ఈ ప్రేమలేని ధర్మముకాని, ధర్మములేని ప్రేమకాని పనికిరాదు. భగవంతునియొక్క భావము కేవలము source తో వచ్చేటంటిదే కాని force తో వచ్చేది కాదు. మన హృదయమునుండి ఆవిర్భవించాలి. ఈ హృదయము పవిత్రమైన విశాలమయము. భగవంతుడు అందరి హృదయములోనూ ఉన్నాడు. ఇది భగవంతుని నిలయము. ఇది భగవంతుని పీఠము. కనుక ఎక్కడ పోయిననూ భగవంతుడు మన వెంటనే, జంటనే, ఇంటనే, కంటనే ఉంటున్నాడు. కనుక నీవు మంచి చేసినా, చెడ్డ చేసినా నీవు ఏమాత్రము కూడను తెలిసి పొరపాటు చేయవద్దు. ఈనాటి మానవుడు యీ విధమైనట్టి అశాంతికి గురికావడానికి కారణమేమిటి? కొన్ని యీ విధమైనట్టి బాధలు, భావములు అడ్డుతగిలి తనయొక్క శాంతిని వుమ్మరం చేస్తున్నాడు. ఈ భావములు pieces చేయడంవలనే యీ peace మీకు లభించలేకపోతున్నాది. ఈ భక్తి భావాన్ని ఏమాత్రము చెదర నీయకుండా చూసుకోవాలి. ఏ విధమైనట్టి ప్రమాదము సంభవించినప్పటికిని

srisathyasaivachanamrutam

భక్తిభావము ఒక్కటిగానే ఉండాలి. ఇవన్నీ కూడను ప్రపంచములో కదలిపోయే మేఘములవంటివి. ఇలాంటి జీవితం కోసం మనం ఎందుకు ఏడ్వాలి?

కనుక మనము ఏపని చేసినప్పటికినీ, మంచి పనిగా భావించాలి. ఈ మంచి పనే భగవంతునియొక్క అనుగ్రహమునకు మూలకారణము.

**మంచిపని చేసి చెడ్డను పొందబోరు**
**చెడ్డపనిని చేసి మంచిని చెందలేరు**
**నింబమునునాటి చూతఫలంబు గనునా?**
**చూతంబునాటి నింబఫలంబు గొనునా?**

కనుక మనము చేసుకున్నట్టి మంచి చెడ్డలే మన బాధలకు మూలకారణము ఎవరో యీ బాధలు కల్పించారని, ఎవరో నన్ను బాధిస్తారని మనము భావిస్తున్నాము. ఇది చాల పొరపాటు మంచి చెడ్డలు రెండింటికినీ మనమే మూలకారణము. కనుకనే 'మనఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' అని మనయొక్క మనోభావములయొక్క స్వరూపమే మనయొక్క బంధ కారణములకు మూలము. కనుక మొట్టమొదట మనలో చెడ్డభావములు రానీయకుండా చూచుకోవాలి. చెడ్డ భావములు వచ్చినప్పుడే చెడ్డ మనసుగా రూపొందుతుంది. చెడ్డభావమును నీవు అరికట్టినప్పుడు చెడ్డ మనసుకు ఆవకాశం లేదు. కనుకనే మనము నిరంతరము కూడను, క్షణక్షణము సంకల్పాలను మనము వాచ్ చేయాలి. Is it good or bad? Is it right or wrong? అనేటువంటి ప్రశ్నలు వేసుకోవాలి. ఇది సరికాదు, అని తెలిసినపుడు దానిని ఏమాత్రముకూడను అనుసరించవద్దు. ఇదే చైతన్యతత్త్వము.

**భూః, భువః, సువః- దేహము-మనస్సు-ఆత్మ**

ఆ చైతన్యము మనయందే ఉంది. కాని దేహాభిమానముచేత, ఈ కాన్షియస్నెను తెలుసుకోలేకపోతున్నాము. ఏమిటీ body? కేవలము materialization. అందుచేతనే గాయత్రీ మంత్రము చెప్పినప్పుడు 'ఓం భూర్ భువః సువః'. 'భూర్' - దేహము, Materialization of body. 'భువః' - అదే mind యొక్క vibration. 'సువః' - యిదే జ్ఞానముయొక్క



srisathyasaivachanamrutam

Radiation. కాబట్టి Materialization, Vibration, Radiation మూడు కూడ మనయందే ఉంటున్నాయి. ఈ Radiation నే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నారు. Constant integrated awareness. ఈ ప్రజ్ఞానమనేటి బ్రహ్మ మనయందే ఉంటున్నాడు. మీ అందరూ కూడను బ్రహ్మస్వరూపులే. వేదమునే విభజించి, వేదమును ప్రపంచమునకు చాటి బ్రహ్మమైనట్టి వేదస్థాయికి అభివృద్ధి పరచినట్టి వ్యాసుడే పుత్రవాత్సల్యమును వీడలేక తనముందే వెళ్తున్న శుకున్ని, 'కుమారా! నిల్చు, నిల్చు, ఒక్కసారి నా మాట విను అన్నాడు. కానీ ఏమాత్రము లెక్కచేయలేదు. కట్టకడపటికి యితనికి సత్యము చెప్పడం మంచిదనుకున్నాడు. కుమారుడు నిల్చాడు, తండ్రి దగ్గరకు వెళ్ళాడు. నాయనా! నీవు నా కుమారుడవు, నీవు నా మాట వినకుంటివా! నీకే కష్టం. అప్పుడు శుకుడు చెప్పాడు. నేను కొడుకుని కాదు. నీవు తండ్రివి కావు. నీవు బ్రహ్మనే. నేనూ బ్రహ్మనే. 'సర్వం బ్రహ్మమయం జగత్' వ్యాసునకు కొంచెము కనువిప్పు కలిగింది.

**లోకాః సమస్తాః సుఖినో భవన్తు-జీవులందరిలో ఆత్మ ఒక్కటే**

కనుకనే అనాది కాలమునుండి యీ భారతదేశమునందు అనేక విధమైనట్టి ప్రబోధలు వస్తూనే వున్నాయి. ఇది మహా పవిత్రమైనట్టి భారతదేశము. ఇది అనేక విధమైనట్టి అపోహ చేతకాని, లేక సందేహము చేతకాని ఉండినట్టిది కాదు. ఇది ఎప్పుడుకూడను పవిత్రమైనట్టి దివ్యత్వంతో కూడుకున్నట్టిదే. ఈ పవిత్రమైన భారతదేశమునందు, ఆధ్యాత్మిక సంపదతో అభివృద్ధి పరచి, యిట్టి ఆధ్యాత్మిక సంపదను యుగయుగములకు, గ్రామగ్రామములకు, పట్టణపట్టణములకు, దేశదేశములకు చాటి సుఖశాంతి నందించినటువంటి యీ సూక్తులే 'లోకాః సమస్తాః సుఖినో భవంతు'. కనుక అన్ని లోకములు భగవంతుని సంబంధించినట్టివే. రూపనామములు ప్రత్యేకముగా ఉండవచ్చును కాని దివ్యశక్తి ఎక్కడ పోయినా ఒక్కటే. మానవులకు కూడా రూపనామములు ప్రత్యేకంగా ఉన్నాయి. కాని ఆత్మతత్త్వము ఒక్కటే. ప్రొద్దున ఒక సాధకుడు అడిగాడు. స్వామీ! కోటానుకోట్లు భక్తులున్నారు కదా లోకములో, అందరియందు ఒకే ఆత్మ ఎలా ఉండగలదు? ఒక్కొక్కరి ప్రాప్తిని పురస్కరించుకొని ఉంటాయి కదా! అన్నాడు. దానికి నేను జవాబు చెప్పాను. ఒక అలంకారము చేసినప్పుడు, ఎన్నో వేల వేల బల్బులు, చిన్న చిన్న

sri sathyasai vahini

బల్బులంతా పెట్టుకొని, ఒక చక్కని అలంకారము చేస్తుంటారు. కాని ఒక్కొక్క బల్బు ప్రత్యేకముగా వేరువేరుగా ఉంటుంది. దాని వోల్టేజీ కూడ వేరు వేరుగా ఉంటుంది. కాని అన్నింటియందు ఉన్నది ఒకే కరెంటు కదా!

**మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే**
**వస్త్రభేదము వేరు దారమొకటె**
**శృంగారములు వేరు బంగారమొక్కటే**
**పశుల వన్నెలు వేరు పాలు ఒకటె**
**జీవజంతులు వేరు జీవుండు ఒక్కడే**
**కులములన్నియు వేరు పుట్టుకొకటె**
**దర్శనంబులు వేరు దైవంబు ఒక్కడే**
**పూల వన్నెలు వేరు పూజ ఒకటె**
**తెలియలేకను మానవుల్ తెలివిదప్పి**
**బ్రతుకు కోసము బహుబంధ బద్ధులైరి**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!**

బల్బులు ప్రత్యేకముగా ఉన్నంత మాత్రమున కరెంటు ప్రత్యేకముగా ఉండదు. ప్రతి దేహముకూడ బల్బు వంటిదే. వీటి రూపనామములు వేరు వేరుగా ఉండవచ్చును. వీటి రంగులు వేరు వేరుగా ఉండవచ్చును. వీటి వోల్టేజీ వేరు వేరుగా ఉండవచ్చును. కాని కరెంటు ఒక్కటే. మన బెడ్ రూమ్‌లో డిమ్ బల్బు వేసుకుంటాము. డ్రాయింగ్‌హాలులో బ్రైట్ బల్బు వేసుకుంటాము. అప్పుడు కరెంటు ఎక్కువవుతుంది. కరెంటు తక్కువవుతుంది అని చెప్పడానికి వీలవుతుందా? ఈ రెండింటియందు కరెంటు ఒక్కటే. అక్కడ వోల్టేజీ తక్కువగా ఉంది. ఇక్కడ ఎక్కువగా ఉంది. అట్లనే ఎవరెవరి ప్రాప్తి పురస్కరించుకొని వారి ప్రాప్తి కొంచెము అభివృద్ధిగా ఉంటుండాది. వారియందు దివ్యత్వము సాక్షాత్కారిస్తుంటాది. ఆ భావము లేనటువారియందు డిమ్‌గా, బెడ్‌రూమ్ బల్బు మాదిరిగా ఉంటుంది. కాని

srisathyasaivachanamrutam

అందరియందు దైవత్వము ఒక్కటే. ఇలాంటి సత్యాన్ని గుర్తించుకున్నట్టి వ్యక్తులకు దేహమునకే మాత్రమ అవకాశము యివ్వకూడదు. కనుకనే ప్రతి మానవుడుకూడను తమ తమ స్థాయిని పురస్కరించుకొని, తమ తమ అనుభూతిని పురస్కరించుకొని, దివ్యత్వాన్ని వర్ణించుకుంటూ ఉంటారు.

## సంస్కారములను బట్టి జీవులలో తారతమ్యాలు గోచరిస్తారు

కాని ఒకరి భక్తి చాల ఉన్నతమైన స్థితిలో ఉండవచ్చు. ఇంకొకరికి విశ్వంపైన అభిరుచి ఎక్కువగా ఉండవచ్చు. ఒకడు విశ్వమనును, ఒకడు విష్ణువనును. ఒకడు విశ్వము పొందు. రెండవవాడు విష్ణువును పొందు. 'యద్భావం తద్భవతి'. తమ తమ భావములను పురస్కరించుకొనియే ఆ ఫలమును మనము అందుకుంటుంటాం. గంగానదిలో కావలిసినంత జలము ప్రవహిస్తూ ఉండాది. కాని నీవు ఎంత పాత్రను తీసుకొని పోతావో, అంత పాత్రకు జలము నిండిపోతుంది. ఈ పాత్రలో ఉన్నంతమాత్రానిదేనా యీ గంగాజలము? ఎంత పాత్రలయినా ఆ గంగనీరు నింపుతుంది. కనుక ఈనాడు మనము ఏం చేయాలి? మనయొక్క పాత్రలు పెంచుకోవాలి. దానిని పెంచుకున్నప్పుడే యీ యొక్క భగవత్ప్రేమ కాని, భగవత్ శక్తి గాని మనలో అమితముగా అభివృద్ధి పొందుతుంది. కనుక యీనాడు భగవంతుని పొందడానికి స్తోత్రము చేసి ప్రయోజనము లేదు. శ్లోక గానము చేసి ప్రయోజనము లేదు. లేక గ్రంథపఠనము చేసి ప్రయోజనము లేదు. యజ్ఞ యాగ క్రతువులు చేసి ప్రయోజనము లేదు. కాని హృదయము లేకపోతే ఇవన్నీ కూడ వ్యర్థమే. హృదయవాసి భగవంతుడు. 'ఈశ్వరః సర్వ భూతానాం'. 'ఈశావాస్య మిదం జగత్'. జగత్ అంతా కూడను ఒక్క దైవ స్వరూపమే. 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'.

## అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించండి

ఇలాంటి ఏకత్వాన్ని మనము అనేకత్వముగా పెంచుకుని, యీ దివ్యత్వాన్ని దూరము చేసుకుంటున్నాము. వద్దు వద్దు. అంతా అనేకత్వములో నున్నటువంటి ఏకత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించరాదు. ఇది కేవలము భగవంతుని సంక్లిష్టమైన భావము. Contraction of Love. కాని అనేకత్వాన్ని ఏకత్వముగా

sri sathyasai vachanamrutam

తీసుకున్నప్పుడు Expansion of Love. ఈ విధమైనట్టి దివ్యత్వాన్ని మనము పొందాలి.

**Stars are many, but sky is one**
**Bodies are many, but life is one**
**Beings are many, but breath is one**
**Cows are many, but milk is one**
**Jewels are many, but Gold is one**
**Nations are many, but Earth is one**
**Religions are many, but truth is one**

ఆ విధమైనట్టి ఏకత్వముతో మనము దివ్యత్వాన్ని పొందాలి. అప్పుడే మానవత్వానికి తగినట్టి శాంతి మనకు లభ్యమవుతుంది. ఈనాటి మానవుడు ఎన్ని సాధనలు చేసినప్పటికినీ, ఎన్ని వేల స్మరణ చేసినప్పటికిని, శాంతి లేక పోతుంది. కారణమేమిటి? దీనికి అనేకమైనట్టి లౌకికంగా, భౌతికంగా, ధార్మికంగా, ఆధ్యాత్మికంగా అభ్యంతరాలు వస్తున్నాయి. ఈ అభ్యంతరాల వల్లనే యీ ఏకత్వము పొందలేక పోతున్నాము. ఒక్కటొక్కటే యీ అభ్యంతరాలను మనం దూరం చేయాలి. ఇవన్నీ మనము లెక్కచేయకూడదు. మీ లక్ష్యాన్ని లక్ష్యము పెట్టుకో.

**సాయి భక్తి ఒక్కటే సర్వచింతలను తొలగిస్తుంది**

**పుట్టుటయొక చింత భూమినుండుట చింత**
**సంసారమొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత చెడుపు చింత**
**కర్మలన్నియు చింత కష్టంబులొక చింత**
**సంతసమొక చింత వింత చింత**
**ప్రాపంచకము చింత ప్రకృతంతయు చింత**
**సంతసమొక చింత వింత చింత**
**సర్వ చింతలు బాపెడు సాయి భక్తి**

sri sathyasai vachanamrutam

**గొనుడు యికనైన జనులార కోర్కె మీర**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!**

అన్ని చింతలే యీ జగత్తులో. చింతలేని మానవుడు, చింతలేని దినమూ ఎక్కడా కనిపించవు. ప్రతి మానవుడు కూడను తనకు తగినంతవరకు అంతో, యింతో చింతలో ఉంటాడు. ఒకరికి అమితమైన చింత ఉంటుంది. ఒకరికి అల్పమైన చింత ఉంటుంది. కాని యిది క్వాంటిటీ వేరుగాని క్వాలిటీ ఒక్కటే. కనుక మనసునకు ఏ విధమైనట్టి అభ్యంతరము లేకుండా ఉండేటువంటి స్థితి మనము పొందాలి. ఈ విధమైనట్టి స్థితిని పొందాలనుకుంటే, నేను చేసేది సరియైనదా లేదా అని చక్కగా పరిశీలన చేయాలి. మంచి మార్గములో పోతున్నాను. సత్యమైన, దివ్యమైనట్టి మార్గాన్ని అనుసరిస్తున్నాను. ఎవరికీ ఏ విధమైనట్టి అపకారము చేయడము లేదు. ఎవరికీ ఏ విధమైనట్టి కీడు చేయడం లేదు. ఈ సత్యాన్ని దృఢముగా మనకు ఉంచుకున్నప్పుడు దేనికీ మనము భయపడనక్కరలేదు. కనుకనే, Truth is GOD. Truth ని మనము పెంచుకొందాము. నీ కాన్షియన్స్‌ని నీవు ఫాలో చేయి. నీ దేహాన్ని ఫాలో చేయవద్దు. మైండ్‌ని ఫాలో చేయవద్దు. Mind is a mad monkey, body is like a water bubble. Don't follow the body, don't follow the mind, follow the conscience. అదే నిజమైనట్టి దైవము.

**దేవుడుండు తన దేహమందే**

నీ దేహమునందే నీ దైవము ఉన్నాడు. దైవము ప్రత్యేకంగా వేరొకచోట లేదు. ఎక్కడ చూచినా దైవత్వమే ఉండాలి.

**దేవుడనగ వేరు దేశమున లేదు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

ఈ పాపముకూడ పరదేశములో లేదు. తాను చేసే చెడుపనిలోనే పాపము ఉంటుంది.

sri sathyasaivachanamrutam

దేవుడనేటంటి వాడు మరొక దేశములో లేదు. తన దేహమంతా ఉన్నాడు. 'దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవ స్సనాతనః'. Body is the Temple of GOD. ఎలాంటి మందిరము? ఫర్మనెంటు మందిరము కాదిది moving temple, moving temple. ఎక్కడ శరీరము పోతూ వుంటే అక్కడ దైవము వస్తుంది నీ వెంట. ఇది పవిత్రమైన మందిరము. దివ్యమైన మందిరము. భవ్యమైన మందిరము. నవ్యమైన మందిరము. ఇలాంటి మందిరముపైన మనకెందుకు విసుగు? కనుక యీ మందిరముయొక్క పవిత్రతను మనము అనుభవించాలి. దేహమునిచ్చిన దెందుకు?

దేహము నిచ్చిన దెందుకో తెలుసా? సందులుగొందులు తిరుగుటకా? కాదు. కైలాసవాసుని కన్నులారా చూచేటందుకే కదా! కనుక మనము దేహాన్ని పవిత్రమైన కర్మలనాచరించుటకు అందించాడు, భగవంతుడు. ఇది దైవముయొక్క గిఫ్ట్! ఈ దేహముచేతనే మన సర్వకర్మలు పవిత్రమైన కర్మలుగా ఆచరించాలి. 'కర్మాను బంధీని మనుష్యలోకే'. ఇలాంటి మనుష్యలోకములో మనము కర్మలను ఆచరించాలి. ఎలాంటి కర్మలు! సత్కర్మలు, సత్సంగములు. యీ సత్సంగము అంటే ఏలాంటిది? ఏదో మంచి భక్తునితో సంగమం అనుకుంటున్నాము. అది కాదు.

**సత్-చిత్-ఆనందములు**

'సత్'. See good, be good, do good. ఎప్పటికీ పర్మనెంట్ అనే దానిపైన సత్ సంగత్వాన్ని మనము పొందాలి. ఆ సత్‌ను మనము పొందేటప్పటికి, 'చిత్' మన వెంటనే ఉంటుంది. అదే 'చిత్'. ఈ సత్, చిత్ రెండు చేరేటప్పటికి ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. సత్ ఎప్పటికీ మార్పు లేనటువంటిది. అది ఒక చక్కెర వంటిది. అదే మధురం వంటిది. అదే మాణిక్యం వంటిది. అదే మధురాతి మధురం. అది చక్కెర వంటిది ఎప్పటికి, ఏ నీళ్ళలో వేసినా, ఏ కాఫీలో వేసినా, ఏ టీలో వేసినా, ఏ పాయసంలో వేసినా, ఏ పదార్థములో వేసినా, ఏ పిండిలో వేసినా దానికి మధురమైన రుచు అందిస్తుంది. అది ఎప్పటికీ సత్యమైనట్టిది. ఆ సత్యమునే ఒకవైపు చిత్ అనే దానిని పట్టుకోవాలి. చిత్ అనగా చైతన్యము. Awareness అనేటువంటి నీళ్ళను చేతుల్లో పట్టుకోవాలి. అప్పుడు ఏంచేస్తారు? ఇది సత్,

sri sathyasai vachanamrutam

ఇది చిత్. ఇది చక్కెర, ఇది నీళ్ళు. కాని ప్రత్యేకముగా ఉండకూడదు. చక్కెరను నీళ్ళను రెండింటిని కలపాలి. అప్పుడది చక్కెర కాదు, నీళ్ళు కాదు. పానకం వేరే పేరు వచ్చేసింది. సత్, చిత్ రెండూ చేరేటప్పటికి ఆనందము మనలో లభిస్తుంది. కనుక యీ రెండింటిని చేర్చేటువంటి విధానాన్ని మనము గుర్తించాలి. అందరియందు సత్ ఉన్నది. ఆ సత్‌యే మనయొక్క దివ్యమైనట్టి ఆత్మతత్త్వము. చిత్‌యే మన దేహ తత్త్వము. ఈ రెండింటియొక్క ఏకత్వమే మానవత్వము.

## ప్రతి మానవునిలోను అర్ధనారీశ్వరతత్వం

ఈ మానవత్వము కేవలము మానవత్వమే కాదు. ఇది 'అర్ధనారీశ్వర' అన్నారు. ఈశ్వరునియందు మాత్రమే అర్ధనారీశ్వర కాదు. ప్రతి మానవునియందు కూడను అర్ధనారీశ్వర ఉండాలి. అదియే లక్ష్యము. అదియే అక్షరము. అక్షరమనేటి అకారమనేటిది ఆత్మతత్త్వము. 'క్ష' అనేది నశించిపోయేటట్టి దేహతత్త్వము. కావున దేహము నశించిపోయేటట్టిది. ఆత్మ నిరంతరము ఉండేటట్టిది. దీనినే వర్ణిస్తూ వచ్చింది వేదము. 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం' అని. కనుక రెండు చేరినటువంటిది అక్షరము. ఇదియే అర్ధనారీశ్వరము. దేహము ప్రకృతి. ఈ ప్రకృతియే పార్వతి. ఆత్మయే శివుడు. కాబట్టి శివపార్వతులుయొక్క ఏకత్వమే మానవత్వము. కనుక యిదే అర్ధనారీశ్వరం అన్నారు. మానవత్వంలో ఎన్నో రీతి రహస్యాలు తెలుసుకోవలసినవి ఉన్నాయి. దైవత్వాన్ని పెంచుకోవడం చాలా సులభం. మీకు తెలియదు కాని మన మనసులో ఉన్నటువంటి దుర్భావములు, దురాలోచనలు, దుర్భాషలు, ఇవన్నీ తీసిపారవేయి. ఈ దుర్భావములు దూరం చేస్తే సద్భావములు ఆవిర్భవిస్తాయి. అప్పుడు అన్నీ పవిత్రమైనట్టి కార్యములు గానే ఉంటాయి.

## హృదయంలో ప్రేమ నింపుకొంటే జగమంతా ప్రేమమయమవుతుంది

హృదయం అనేటువంటి ట్యాంకులోపల ప్రేమ అనేటి జలము నింపినావంటే ఈ సత్కర్మలయందు, సద్భావములయందు అన్నింటియందు యీ ప్రేమరసమే వస్తుంది. ఈ దేహమునకు పంచప్రాణములు, పంచేంద్రియములు, పంచకోశములు యివన్నీ ట్యాప్స్

sri sathyasaivachanamrutam

వంటివి. ఈ ట్యాప్స్ అన్నీ హృదయమనే ట్యాంకుతో కనెక్షనయివుంటాయి. ఏ ట్యాప్ త్రిప్పినా సరే అక్కడ మనకు ప్రేమయే వస్తుంది. కనుక మీరు మొట్టమొదట హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి. ఏమిటీ ప్రేమ, ప్రేమ అంటుంటారు, అనుకుంటారు, మీరు? ఈ ప్రేమయే హృదయం. హృత్+దయ. హృదయ అదే compassion. ఈ compassion అనేటువంటిదే ప్రేమ. కనుకనే యిది mankind అంతేకాని kind లేనటువంటిది మానవత్వం కాదు. Mankind మానవుడు ఎప్పుడుకూడను kindness తో ఉండాలి. ఆ kindness ఏ హృదయమునకు గుర్తు. ఆ kindness ను భంగపరచిన, పాపము చేసిన వారమవుతాము. కాబట్టి మనము ఏ విధమైన అపకారమూ చేయకూడదు.

దీనిని పురస్కరించుకొనియే 'అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనం ద్వయం, పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం'. పద్దెనిమిది పురాణాలు చదవడానికి ఎవరికి కాలము చిక్కుతుంది? కనుక యీ అన్నింటియొక్క సారత్వము ఒక రెండు వాక్యములలో చెప్పాడు. 'పరోపకారః పుణ్యాయ' పరులకు ఉపకారము చేయుడము పుణ్యము అన్నాడు. కాని యిదికాదు దీని అర్థము. పర, ఉప, కర. ఇది మూడు పదములతో చేరియుంటున్నది. పర=ఆత్మతత్త్వము, ఉప=సమీపత్వము, కర=చేయడానికి ప్రయత్నం చేయి. ఆత్మకు సమీపముగా పోవడానికి ప్రయత్నము చేయడమే పరోపకారము. ఎవరికి యింత దానమో, ధర్మమో చేస్తే అది పరోపకారము కాదు. పర, ఉప సమీపముగా పోవాలి. దైవత్వానికి సమీపంగా పోవడానికి ప్రయత్నము చేయడమే పరోపకారము. 'పాపాయ పరపీడనం'. పర, పీడనం పర అనగా ఏమిటి? ఏకత్వము. ఏకత్వాన్ని భిన్నత్వంగా చేయడమే పీడనము. ఏకత్వంగా ఉన్నట్టి ఆత్మతత్త్వాన్ని భిన్నత్వంగా మనము మార్చకూడదు. కనుక ఇదియే పాపము అన్నారు. కనుక ఏకత్వాన్ని ఏకత్వముగా ఉండడమే పుణ్యము అది ఏకత్వముగా ఉంచకపోతే అది పాపము. కనుక Help ever, hurt never అన్నారు. మనము ఎప్పుడుకూడను ఉపకారము చేయడానికి చేతకానప్పుడు నోరు మూసుకొని కూర్చుంటే మంచిది. అపకారము చేయక పోవడమే గొప్ప ఉపకారము. కనుక నీవు ఆ విధమైనట్టి జీవితాన్ని గడిపినప్పుడు నీ కుటుంబము, నీయొక్క వంశము, నీయొక్క సంపద, యీ సమాజము, ప్రపంచము అంతా పవిత్రమైనట్టిదిగా రూపొందుతుంది. ఎవరిని బాధ పెట్టినా



sri sathyasaivachanamrutam

దైవాన్ని బాధ పెట్టినట్టే అవుతుంది. ఎందుకంటే అందరిలో ఉన్నది భగవంతుడే, అందరియందు ఉన్నది ఏకాత్మతత్త్వమే.

## దైవం ఒక్కటే - పేర్లు వేరు

కాబట్టి 'ఏకంసత్ విప్రా బహుధా వదంతి' ఉన్నదానినే అనేకమంది అనేక రకాలుగా చెప్తుతూ వచ్చారు. చూడండి. ఈ కప్‌లో నీరు వుంది. ఇంగ్లీషువాడు వస్తాడు. యిది వాటర్ అంటాడు. హిందీవాడు వస్తాడు, పానీ అంటాడు. తమిళవాడు వస్తాడు, తన్నీ అంటాడు. సంస్కృతంవాడు వస్తాడు, ఉదకమంటాడు. తెలుగువాడు వస్తాడు, నీరు అంటాడు. ఈ పేర్లంతా కూడను ఒక పదార్థమునకు పెట్టినంటువంటివే కాని, ఆ భాషలయొక్క మార్పే. కనుక దివ్యమైనట్టి ప్రేమతత్త్వము అందరియందు ఉంటుంది. అది మార్పు చేందేటువంటిది కాదు. క్షీణించేటువంటిది కాదు. కనుక ఎవరు చెప్పినా అది ఫోర్స్‌తో వచ్చేటటువంటిది కాదు. మనలోనుండి ఆవిర్భవించినట్టిదే. అన్నిటియందు ఉన్నటువంటిదే దివ్యత్వము. ఇది అనేకత్వము కాదు. ఏకత్వమే, ఏకత్వమే. ఇట్టి ఏకత్వాన్ని మనము చింతించుకుంటూ మన జీవితములో ఏదో సమయం చిక్కినప్పుడు, పవిత్రమైన కర్మలు ఆచరిస్తూ పోవడము చాలా ఉత్తమమైన కర్మ. నీవు ఏ కర్మను వదలనక్కరలేదు. సర్వకాలములు, సర్మకర్మలూ ఆచరించుకో. కాని 'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావము పెట్టుకో. ఏమి చేసినా అంతా దైవానికి అర్పితమే. అంతాకూడను దైవమయంగా మారిపోతుంది. దైవము లేనటువంటిది ఒక్కటీ లేదు, నీ దగ్గర. అంతా దైవమే. నీ వెంట, జంట, యింట, కంట అన్నిటియందును దైవమే ఉన్నాడు. ఉన్నది ఒక్కటే. కాని మనకు కనిపించదు. కాని మనకు చిక్కదు. చిక్కకపోయినంత మాత్రమున, కనిపించక పోయినంత మాత్రమునదైవమే లేదు అనడానికి వీలులేదు.

## మనస్సే బంధమోక్షములకు కారణము

కనుక నిన్న చెప్పాను. మన చుట్టూ గాలి ఉంది. ఆ గాలి లేకపోతే మనము జీవించలేము. కాని ఆ గాలిని మనము చూడలేము. గాలిని పట్టలేము. పట్టకుండా

srisathyasaivahini.org

లేకపోయినంత మాత్రమున, చూడకుండా లేకపోయినంత మాత్రమున లేదని చెప్పడము ఎంత వెఱ్ఱితనము? అది లేకపోతే మనమే లేము. కాబట్టి ఉన్నది. పంచభూతములన్నీ భగవత్స్వరూపమే. కాబట్టి ఏ భూతమును కూడ మనము వ్యర్థము చేయకూడదు. కనుక యీ భావముచేత ప్రతి మానవుడును తన నిత్య జీవితములో సాధన సలుపుకుంటూ పోతే, దివ్యత్వాన్ని తప్పక చేరగలడు. కాని కొన్ని కొన్ని ఎన్నుకున్నటువంటి కొన్ని బంధములచేత ఆ దివ్యత్వాన్ని పొందలేక పోతున్నాడు. ఈ bondage ఒక నెగెటివ్. Liberation ఒక పాజిటివ్. కనుక నీవు పాజిటివ్‌గా మార్చుకోవడానికి ప్రయత్నం చేయాలి. Lock ఉంది, key ఉంది. ఈ key, lock లో పెట్టు. Turn left side, open అవుతుంది. Turn right side. Lock. Same lock, same key, turning is difference కనుకనే ఈ ప్రపంచమంతా కూడను దైవత్వమే. ఈ mind అనేటువంటిది key. నీవు దైవమువైపు త్రిప్పు. positive అవుతుంది. నీవు ప్రకృతివైపు త్రిప్పు. బంధన అయిపోతుంది. దీనిని పురస్కరించుకునియే 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు.

**దైవత్వాన్ని అందుకోవడమే పరోపకారము (పర+ఉప+కర)**

ఏదో ఒక దినమున యీ బంధననుంచి తప్పించుకొనక తప్పదు. నీవు తప్పించుకొనకపోయినా, అదే నిన్ను విడిచిపెట్టి పోతుంది. పుట్టిన ప్రతి మానవుడును గిట్టక తప్పదు. కాని

**చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆదిమధ్యాంత రహితుడనాదివాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**ఆత్మరూపుడై అంతట వెలసియుండు.**

అతను సర్వసాక్షియై ఉంటుంటాడు. ఆత్మకు పుట్టుకలేదు. చావులేదు. ఇలాంటి తత్త్వాన్ని మనము తప్పక మొట్టమొదట గుర్తించాలి. దైవత్వాన్ని పొందిననాడు సర్వులప్రేమకు పాత్రుడౌతాడు. ఆ ప్రేమకు మించినట్టి తత్త్వము మరొకటి లేదు. అందుకే Love is GOD, Live in LOVE. కనుక నీవు సత్య, ప్రేమలయొక్క తత్త్వాన్ని బాగా గుర్తించినప్పుడే నీ

srisathyasaivachanamrutam

జీవితము సార్ధకమవుతుంది. ఈ ప్రాపంచిక సంబంధమైనట్టి సుఖదుఃఖములు, సంతోషములు, ప్రాప్తులు యివన్నీకూడను కదలిపోయే మేఘములే. ఎంతమంది ఎన్ని విధములైనట్టి సుఖముల ననుభవించారు? ఎన్ని విధములైనట్టి కష్టములననుభవించారు? వారేరి? లేరే రాజులు, రాజ్యములే ఏలరే, గర్వోన్నతిని పొందరే, వారేరి?

నిరత సత్యప్రౌఢి ధరణినేలిన హరి
    శ్చంద్రుడీ ధరబాసి చనగలేదె
ఎల్ల లోకములేలె ఎసగ శ్రీనలరాజు
    తనవెంట భూమిని గొనుచు చనెనె
కృతయుగంబును నలంకృతి చేయు మాంధాత
    సిరి మూటగట్టుక అరిగినాడె
జలధి సేతువుగట్టె అలనాడు శ్రీరాము
    దుర్విపై నిప్పుడు ఉన్నవాడె
ఎందరెందరు రాజులు ఏగినారొ
ఒక్కరును వెంటగొనిపోరు సుర్వితలము
నీవు మాత్రము రాజ్యంబు భోగములను
తలను కట్టుక పోదువా ధర్మహృదయ!

అన్నారు. ఎవరూ సంపాదనలను పట్టుకు పోయే వారు లేరు. అందరూ వదలిపెట్టి పోయేటటువంటి వారే. ఏ విధంగా పుట్టాడో, ఆ విధంగానే చస్తాడు. వచ్చే దినమున బట్టైనా కట్టుకొని రారు, వెళ్ళేటప్పుడు అడ్రసయినా యిచ్చిపోరు. ఈ పదవులు పట్టుకొని ఏమి అనుభవించేది? ఎవరెవరి ప్రాప్తానుసారం వారు పొందుతుంటారు. కాని ఉన్నంతలో మనము దీనిని అనుభవించాలి. పవిత్రతను పొందాలి. ఇంతేకాదు ఆదర్శవంతమైన వ్యక్తిగా రూపొందాలి. ఈ ideal యొక్క వ్యక్తియే మానవత్వం. కర్మాను బంధీని మనుష్యలోకే. ఇందులో బంధింపబడినది. ఈ మానవదేహము పరోపకార నిమిత్తమై ఏర్పడినట్టి దేహమే. సాధ్యమైనంతవరకు, పరోపకార సంబంధమైనట్టి కార్యములో ప్రవేశపెట్టు. అదియే పర,

sri sathyasai vahamrutam

ఉప, కర, అనగా దైవత్వానికి సమీపంగా పోయేటట్టి కార్యక్రమములలో పాల్గొను. ఈ విధమైన దివ్యత్వాన్ని యీ రకమైన మార్గములోనే బోధించుకోవచ్చును. కాని గమ్యం ఒక్కటే. ఈ 'గోలు'ను మనము లక్ష్యములో పెట్టుకోవాలి. గోల్‌ను మరచిపోతే మనము ఏమీ పొందలేము.

చాలామంది పిల్లలు ఆడుతుంటారు. ఫుట్‌బాల్, ఈ ఫుట్‌బాల్‌ను ఎంతవరకు కాలుతో కొడతారు. ఎప్పుడూ కాలుతోనే కొడుతుంటారు. అక్కడ వాళ్ళు కొడుతుంటారు. ఇక్కడ వాళ్ళు కొడుతుంటారు. ఈ కాలి దెబ్బ యీ ఫుట్‌బాల్‌కి తప్పిందా? లేదు. ఎంతవరకు దీనికి తప్పదిది? ఆ ఫుట్‌బాల్‌లో గాలి ఉన్నప్పుడు కూడా వాడు కొట్టాడు. వీడు కొడ్తాడు. అందులో గాలిపోతే అప్పుడు చేతికి అందుకుంటాడు. అదే విధముగానే యీ జీవితమనేది ఫుట్‌బాల్ ఆట. అక్కడ ఆరుమంది, ఇక్కడ ఆరుమంది ఉంటారు. ఈ ఆరుమంది దుర్మార్గులు ఒక వైపున ఉంటారు. సన్మార్గులు ఒక వైపున ఈ సన్మార్గులు, దుర్మార్గులు యీ కలహము జరుగుతునే ఉంటుంది. ఈ యొక్క యుద్ధం జరుగుతూనే ఉంటుంది. ఈ సంఘర్షణ జరుగుతూనే ఉంటాది. అయితే యీ ఆరుగురు ఎవరు? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యములు. ఈ ఆరుమంది ఒక వైపున, సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస, ప్రకృతిధర్మము ఈ ఆరుమంది మరొక వైపున ఉంటారు. ఆ ఆరుమంది ఒక వైపున కొడ్తుంటారు. అయితే దీనికి ఒక గోల్ ఉంటుంది. అదే రెండు స్థంభములు నాటి ఉంటారు. ఈ రెండు స్థంభాల మధ్యలో ఫుట్‌బాల్ పోయినప్పుడు గోల్ అవుతుంది. బయటకు పోతే అవుట్ అవుతుంది. అదియే విద్య. 'ఇహమున సుఖియింప హేమ తారక విద్య, పరమున సుఖియింప బ్రహ్మవిద్య. ఈ రెండు విద్యలున్న మనకు మార్పేలేదన్నా. అదియే మనకు లిమిట్. ఈ రెండింటి మధ్యలో నున్నట్టి దయ అనే గోల్ కొట్టినప్పుడు, దివ్యమైనట్టి విజయాన్ని సాధిస్తుంది. ఈ బ్రహ్మ విద్య, ధర్మవిద్యలను రెండు విద్యలకు మధ్యలో లేనప్పుడు అది అవుట్ అయిపోతుంది. అప్పుడేమవుతుంది? పునరపి జననం పునరపి మరణం. ఈ గోల్ మధ్యలో పోయిందా, పునర్జన్మ నవిద్యతే. కాబట్టి పుట్టుక వున్నప్పుడే చావు వస్తుంది. పుట్టుక అనేది లేకుండా చావు ఎక్కడుంది? దానినే మోక్షము అన్నారు. మరొక విత్తనముగా ఉండనిది. ఈ సంబంధమైనట్టి తత్త్వమునే మనము గుర్తించాలి.

sri sathyasai vahini amrutam

ప్రేమస్వరూపులారా! మీరందరూ ప్రేమమయులే. ఆనంద పిపాసులే. ఆత్మస్వరూపులే. ఆ భావాన్ని మీరు తప్పక అభివృద్ధి పరచుకోవాలి. I am not man. I am God, I am God. దేహము మానవతత్త్వము. కాని నేను దేహము కాను. మల మూత్ర దుర్గంధ మాంస రక్తములేని పునుగు జవ్వాజులు పుట్టబోవు.

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుంబులపొది లెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

ఈ దేహమనేటిది ఒక ఉపాధి. అందులో నున్నట్టి ఒక చైతన్యమే మన స్వరూపము. నీవు నాశనమయ్యేటంటివాడవు కావు. నీ ఆత్మతత్త్వము నిరంతరము నాశన రహితమే. కనుక అట్టి ఆత్మతత్త్వాన్ని భావించుకుని, దేహమును ఉపాధిగా విశ్వసించు. ఉపాధి, ఉపాధి. Body, mind, senses అన్నీ కూడా ఉపాధులే. నెగెటివ్‌లే. ఈ నెగెటివ్‌లు పాజిటివ్‌లోపల ఉండి అన్నీ నడిపిస్తుంటాయి. కనుకనే పాజిటివ్ ఆలోచనలను అభివృద్ధి చేసుకో. అప్పుడే నీవు ధన్యుడయిపోతావు. ఈ తుచ్ఛమైనట్టి, అనిత్యమైనట్టి, అశాశ్వతమైనటువంటి వాటి మీద మనస్సు అభివృద్ధి పరచుకోవద్దు. అప్పుడే అందరికీ శాంతి లభిస్తుంది. ఈ శాంతిని మన అనుకూలముకోసం కాకుండా, మన స్వార్థంకోసం కాకుండా యీ జగత్తుకోసం కూడ ఈ శాంతిని మనం చాటాలి. అప్పుడే మన జీవితము కూడ సార్థకమవుతుంది. జగత్తుకూడ పవిత్రమై పోతుంది.

**(తేదీ 18-04-1998న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam